క్లుప్తంగా

ఘనంగా మడేలయ్య ప్రతిష్ఠ

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో బుధవారం మడేలయ్య దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ దేవాలయం నిర్మాణానికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, మాజీ సర్పంచ్ చాగంటి మధుసూదన్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మరికంటి రేణుబాబు, దేవాలయం నిర్మాణ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు..

ఎంఈఓకు..

ఖమ్మం సహకారనగర్: ఇటీవల ఖమ్మం అర్బన్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన బి.రాములును తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు ఆధ్వర్యాన బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్, ఖాజామియా, అశ్రిన్, రమేష్, మోహన్ రాజ్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి..

తిరుమలాయపాలెం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన తిరుమలాయపాలెం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డిని బుధవారం పాఠశాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం మండల ప్రజలకు గర్వకారణమని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల అంబేద్కర్, గుగ్గిళ్ల అశోక్, పోలెపొంగు వెంకటేశ్వర్లు, పోలేపొంగు రాం గోపాల్, కొమ్ము పూలే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు..

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తోకచిచ్చు రామచంద్రరాజు పదవీ విరమణ సందర్భంగా బుధవారం స్కూల్ కాంప్లెక్స్ పరిధి గోవింద్రాల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరాజును ఎంఈఓ వెంకటేశ్వర్లు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా చేసేది ఉపాధ్యాయులే అన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న దయాకర్‌రెడ్డి, తదితరులు

ఖమ్మంఅర్బన్: పర్యావరణంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాకతీయ విద్యా సంస్థల వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ ఫరీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

నేలకొండపల్లి: యువత మత్తుకు బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై పి.సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కాలేజీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిబంధనలు పాటించాలని, నేరాలపై 1930, 100 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: నిబంధనలకు విరుద్ధంగా, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన బుధవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. పుస్తకాలు, నోట్‌బుక్స్, డ్రెస్‌లు, ఇతర మెటీరియల్ పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని సంఘ నేతలు ఆరోపించారు.

రైతుల కుటుంబ నిర్ధారణ

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ పొందని రైతుల కుటుంబ నిర్ధారణ కోసం ప్రవేశపెట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బుధవారం మండలంలోని బుద్ధారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన 42 మంది రైతుల కుటుంబ వివరాలను మండల వ్యవసాయాధికారి డి.అరుణకుమారి ఆధ్వర్యాన యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శిరీష, అరవింద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయంపై మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచిందన్నారు.

ఏళ్లుగా తాత్సారమేల..?

కేఎంసీలో సిబ్బంది ప్రక్షాళనపై నీలినీడలు

- ఫైళ్లను ముందుకు కదలనీయని పైరవీకారులు
- ఖాళీగా కూర్చుంటున్న సిబ్బందిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని విమర్శలు
- సిబ్బందికి అండగా కొందరు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు



ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇష్టారీతిగ వ్యవహరిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు గతంలోనే అధికారులు ఉపక్రమించారు. సిబ్బందిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు సైతం కార్యాలయ పాలనను గాడిలో పెట్టేందుకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు ఏళ్ల తరబడి పలు విభాగాల్లో తిష్టవేసిన రెగ్యులర్ సిబ్బంది సెక్షన్లు మార్చేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా సిబ్బందిని ప్రక్షాళన చేస్తూ వారికి కొత్త విభాగాలు కేటాయించి అధికారులు ఫైళ్లను సిద్ధం చేశారు.

ఖాళీగా ఉంటున్న సిబ్బంది..

పనులు లేకుండా ఖాళీగా తిరుగుతున్న వారిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో గదిలో ముగ్గురు, నలుగురు సిబ్బంది ఖాళీగా కూర్చున్నా వారిని అక్కడి నుంచి కదపకుండా అడ్డుకుంటున్న వారికి ఏమి లాభం చేకూరుతుందనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఫైల్ పెట్టిన అధికారికి.. ఆ ఫైల్‌ను ఆపాలని ఫోన్ చేసి మరీ సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం కమిషనర్‌కు కూడా తెలియకుండా కొందరు మేనేజ్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక సిబ్బంది ప్రక్షాళన చేద్దామన్నా.. చేయకుండా అడ్డుకునే వారు ఎక్కువయ్యారని అధికారులు బహిరంగంగా పేర్కొనడం గమనార్హం.

ముందుకు కదలని ఫైళ్లు..

సిబ్బంది ప్రక్షాళనపై అధికారులు సిద్ధం చేసిన ఫైళ్లను ముందుకు కదలకుండా పైరవీకారులు అడ్డుపడుతున్నారనే చర్చ కేఎంసీలో బహిరంగంగానే జరుగుతోంది. కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమకున్న సంబంధాలు, ఇతర లావాదేవీలను ఆసరాగా చేసుకుని ఫైళ్లను కదలకుండా చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విధంగా అధికారులు మూడు,నాలుగు సార్లు ఫైళ్లను పెట్టేందుకు ప్రయత్నించగా.. పైస్థాయి వారు వీటిని అడ్డుకున్నట్లు తెలిసింది. ఓ పక్క కార్పొరేటర్లు సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నప్పటికీ కార్యాలయంలో ఉన్న కొందరు వీరిని కాపాడుతున్నారనే చర్చ బహిరంగంగానే వినిపిస్తోంది.

మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం



క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయిస్తుందని మేయర్ పేర్కొన్నారు. ప్రభుత్వ అందజేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ మహేందర్, స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, ఏడీ ఎంసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా,మెప్మా అధికారులు మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించే కార్యక్రమంలో అత్యుత్సాహం చూపించారన్న విమర్శల వెల్లువెత్తుతున్నాయి. క్యాంటిన్ ప్రారంభానికి కేఎంసీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు హాజరవుతారని తెలిసినా.. వారు రాకుండానే మెప్మా సిబ్బంది ప్రారంభ కార్యక్రమాన్ని పూర్తి చేశారని కేఎంసీలో చర్చ జరుగుతుంది.

వ్యాధులపై అప్రమత్తం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగర పరిధిలో డెంగీ కేసులు నమోదవుతున్న తరుణంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. బుధవారం కేఎంసీ సమావేశ మందిరంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఎస్‌ఐలు, ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలు పుట్టవని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చనే విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, డీఈ ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో భవన నిర్మాణాలకు సంబంధించి కేఎంసీ అధికారులు ఇచ్చిన అనుమతులను అతిక్రమించి, నిబంధనలను ఉల్లంఘించిన పలువురికి టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. బుర్హాన్‌పురంలో ఓ వ్యక్తి తన ఇంటి పక్కన చేపట్టిన నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, తమ స్థలంలోకి వచ్చి నిర్మాణాలు చేస్తున్నట్లు కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు సంబంధిత భవనాన్ని పరిశీలించి, యజమానికి నోటీసులు జారీచేసినిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించినట్లు తెలిసింది. అలాగే, ఖమ్మం బైపాస్‌రోడ్డు, రాపర్తినగర్, జయనగర్ కాలనీ ప్రాంతాల్లో అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

త్వరలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు..



కోనాయిగూడెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్ సంస్థ డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం అట్టి స్థలాన్ని విద్యుత్ సంస్థ డీఈఈ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ అధికారుల సూచన మేరకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటయించగా.. దాదాపు ఎకరం స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కోరి మట్టి శాంపిళ్లను సేకరించారు. అనంతరం డీఈఈ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో తరణిహాట్, వెంకటగిరి, కోనాయిగూడెం గ్రామాల్లో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించి త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా, ఏళ్లగా సాగు చేసుకుంటున్న కొచ్చెర్ల శ్రీనివాసరావు తనకు చెందిన భూమి కాకుండా ఇతర భూమిని తీసుకోవాలని అధికారులను కోరగా.. అందుకు కాంగ్రెస్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు మద్దతు పలికాడు. సదరు రైతుకు అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇమ్రాన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ ఎంఆర్‌ఐ డీఈఈ బద్రుపవార్, డీఈఈ కన్‌స్ట్రక్షన్ హిరాలాల్, సివిల్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి, రాజేశ్వరపురం, ఏఈ నారాయణరావు, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తాం

ఖమ్మంమయూరిసెంటర్: విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన వారి 24వ వర్ధంతి సభను నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ..గతంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావాలని ప్రయత్నించిన ప్రభుత్వాలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యాన పోరాటాలు చేశామన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల జాబితాలోని విద్యుత్‌ను లాగేసుకొని సంస్కరణలు తీసుకువచ్చిందని, జీఎస్‌టీతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి మీద దెబ్బకొట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం నాయకుడు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు తిరుపతిరావు, రమ్య, సింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీకి నిధుల ప్రతిపాదన విరమించుకోవాలి

రఘునాథపాలెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ఎల్ఐసీకి ఇవ్వాలనే ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం రఘునాథపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డులోని నిధులను కార్మికుల సంక్షేమానికే ఉపయోగించాలని, 50ఏళ్లు నిండిన వారికి నెలకు రూ. 5వేల పింఛన్ ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను ఎల్ఐసీకి అప్పచెబితే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పసుపులేటి నరసింహారావు, ఉపేందర్, శంకర్, రాజు, ఎల్లయ్య, రమేష్ ,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.మహబూబ్ పాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో నిర్వహించిన ఒకరోజు దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దీక్ష చేస్తున్న తమకు ప్రస్తుతం మంత్రి వర్గం, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్రమబద్ధీకరణ చేస్తామని హామీనిచ్చారని, అట్టి హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాగా, దీక్షకు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు మద్దతు పలుకగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, అనిల్, మల్లికార్జున్, విజయలక్ష్మి, చందు, ఇస్మాయిల్ అశోక్, భగవాన్ తిరపయ్య, కృష్ణారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు ఆధ్వర్యాన బుధవారం 'మా వాటా మాకే'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన చేయాలని, రాజ్యాంగబద్ధంగా ఏ హక్కులకు నోచుకోక, చట్టసభలలో ప్రాతినిధ్యాలు లేక, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం చేయాలన్నారు. రిజర్వేషన్ల కోసం బీసీలు పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు మేకల సుగుణరావు, ఓరుగంటి శేషగిరిరావు, మధు, మలీదు నాగేశ్వరరావు, చింతల వెంకట్, ఆకుల శేఖర్‌బాబు, సింగమ్ జనార్ధన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ సర్కిల్‌లో క్వాలిటీ కంట్రోల్ తనిఖీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ నుంచి రఘునాథపాలెం మండలం వీవీపాలెం వరకు నిర్మించిన రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణ పనుల నాణ్యతలను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. రూ.35 కోట్ల అంచనాలతో నిర్మాణం చేసిన ఈ పనులను ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో అధికారులు పరిశీలించిపనులకు సంబంధించిన శాంపిళ్లను సేకరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ సూరిబాబు, ఏఈలు భానుకిరణ్, ప్రసాద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంరూరల్: ఈ నెల31, సెప్టెంబర్ 1,2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రగతిశీల మహిళా తెలంగాణ రాష్ట్ర ఏడో మహాసభలను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మక్క తెలిపారు. మండలంలోని కాచిరాజుగూడెంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించాక ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు కేతబోయిన రాధక్క, ఎం.అలివేలు, శ్రీలత, రాయల కళ్యాణి, ఎం.మాధవి, భద్రమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్‌ను విజయవంతం చేయాలని తిరుమలాయపాలెం ఐసీడీఎస్ సీడీపీఓ బి.సరస్వతి కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మెటీరియల్‌ను అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసుకొని పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కె.రమాదేవి, సువర్చలా, సూపర్‌వైజర్లు లక్ష్మీకుమారి, ఉమా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

తిరుమలాయపాలెం: కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తప్పుల సవరణ తదితర అంశాలపై బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల తహసీల్దార్ పీవీ రామకృష్ణ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌తో కలిసి బీఎల్‌ఓ యాప్‌పై అవగాహన కల్పించి, ఓటర్ పట్టికల సవరణలను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కాలనీవాసులకు రక్షణ కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల వినోబా నవోదయ కాలనీవాసులకు రక్షణ కల్పించాలని ఓపీడీఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడేళ్ల నుంచి జీవనం సాగిస్తున్న తమపై మంగళవారం ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొంతమంది గూండాలతో తమపై దౌర్జన్యం చేయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూదాన భూమికి హద్దులు తేల్చి మంచినీళ్లు, కరెంట్ తదితర సౌకర్యాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల లక్ష్మణాచారి, చొప్పదండి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణేలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న యూబీఐ అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యాన రూ.10ల నాణేలపై అవగాహన ర్యాలీని బుధవారం నగరంలో నిర్వహించారు. రూ. 10ల నాణేలు చట్టబద్ధంగా చెల్లుబాటులో ఉన్నాయని, అన్ని రకాల వాణిజ్య, వ్యాపార లావాదేవీల్లో వీటిని వినియోగించుకోవాలని బ్యాంకు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లో నాణేలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి, ఏజీఎంలు సర్వేశ్, సుధాకర్‌రావు, బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి గొప్ప వరమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని కొత్తలింగాలలో 14 మందికి కల్యాణలక్ష్మి, 122 మందికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.32 లక్షల విలువైన చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అనంతరం బర్లగూడెంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు ఆరెం రవి, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మలపాటి సత్యనారాయణ, రెడబోతు గోపీరెడ్డి, ఏపూరి మహేందర్‌కుమార్, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విచ్చల విడిగా మద్యం షాపుల నిర్వహణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ విచ్చలవిడిగా మద్యం షాపులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్మిట్ రూమ్‌ల పేరుతో వైన్ షాపును ఆనుకొని రోడ్ల పక్కనే బార్లను నిర్వహిస్తున్నారన్నారు. తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా షాప్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, షాపు అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, రఘునాథపాలెం మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు తిరుపతిరావు, సుదర్శన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిపై పాలకుల నిర్లక్ష్యం

కామేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీ సిబ్బందిపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని భారత కార్మిక సంఘాల సమైక్య వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్ అన్నారు. బుధవారం పాతలింగాల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలిక విద్యాభివృద్ధికి దోహదపడే కేజీబీవీలో పని చేసే సిబ్బందికి కనీస వేతనాలు అందే పరిస్థితులు లేవన్నారు. కేజీబీవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరుతూ.. వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది జ్యోతి, తులసి, అనిత, మమత, లక్ష్మి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించమంటే దౌర్జన్యం

ఖమ్మం మామిళ్లగూడెం: తన పట్టా భూమిలో గుడిసెలు తొలగించమంటే దౌర్జన్యం చేస్తున్నారని భూయజమాని వేజెళ్ల సురేష్‌కుమార్ ఆరోపించారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా భూదాన్ ల్యాండ్ పేరుతో భూముల ఆక్రమించిన స్థానికేతరులు దాన్ని ఒక వ్యాపారంగా మార్చుకొని పక్కన ఉన్న తన భూమిలో గుడిసెలు వేసి విక్రయిస్తుండడంతో అడ్డుకున్న తనపై అసాంఘిక శక్తులతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడో రద్దయిన భూదాన్ ట్రస్ట్ బోర్డు పేరుతో ఫోర్జరీ పట్టాలు సృష్టించి, పేదల మాటున రూ.లక్షలు దోచుకునే కొందరూ ఇటివంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు పూర్తి విచారణ చేసి తన భూమికి రక్షణ కల్పించాలని, తనపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దిరిశాల వెంకటేశ్వరావు, బండి జయకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: జాతీయ నూతన విద్యా విధానానికి విద్యార్థులు ఉద్యమించాలని, శాస్త్రీయ విద్య విధానమే లక్ష్యంగా పోరాటాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు రాకేష్, సునీల్, రోహిత్, నరేష్, గోపి, సాయి, వెంకటేష్, రమ్య, కల్పనా, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ నారాయణ' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ప్రజ్ఞావికాస్ సంస్థ శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామిజీ మంగళాశాసనాలతో ఇటీవల ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తమ విద్యార్థిని తెన్నులి సుచిత్ర ప్రతిభ కనబర్చారని తెలంగాణ నారాయణ పాఠశాల డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్‌రావు, కొదుమూరు నాగపవన్‌లు తెలిపారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని పాఠశాలలో అభినందించి మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న సుచిత్ర వచ్చే నెల 2న ముచ్చింతల్‌లో జీయర్ స్వామి ఆశ్రమంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

తిరుమలాయపాలెం: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ సూచించారు. బుధవారం మండలంలోని హస్నాబాద్, సుబ్లేడు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హస్నాబాద్ గ్రామంలో జ్వరాలకు సంబంధించి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. సుబ్లేడు పీహెచ్‌సీ డాక్టర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.